క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కోవెలకుంట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రాజయ్య తెలిపారు. ఈ నెల 25వ తేదీ నంద్యాల మున్సిపాల్ పాఠశాల క్రీడా మైదానంలో అండర్ –17,14 విభాగాల్లో టెన్నికాయిట్ ఎంపిక పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన అబ్దుల్ రహిమాన్, యాసిన్, సుమంత్ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. త్వరలో ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. విద్యార్థులను హెచ్‌ఎంతోపాటు పిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు నాగేశుడు, మల్లికార్జున, శివశంకర్‌రెడ్డి, సుగుణ తదితరులు అభినందించారు.

వీఆర్వోల బదిలీల్లో స్వల్ప మార్పులు

కోవెలకుంట్ల: మండలంలోని వీఆర్వోల బదిలీ ఉత్తర్వుల్లో స్వల్ప మార్పులు జరిగినట్లు తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన వీఆర్వోల సాధారణ బదిలీల్లో ఉయ్యాలవాడకు చెందిన నరసింహారెడ్డిని కోవెలకుంట్ల 1వ సచివాలయ వీఆర్వోగా బదిలీ చేశారని తాజాగా ఆ బదిలీని రద్దు చేసి సంజామల మండలం పేరుసోమల వీఆర్వోగా నియమించారని తెలిపారు. గతంలో 1వ సచివాలయ వీఆర్వోగా పనిచేస్తున్న రాజ్యలక్ష్మిని అక్కడే కొనసాగేలా ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. రేవనూరు వీఆర్వో సుజాతను మొదట ఉయ్యాలవాడ మండలం ఆర్ జంబులదిన్నెకు బదిలీ చేశారని.. ప్రస్తుతం ఆమెను కోవెలకుంట్ల ఐదో సచివాలయ వీఆర్వోగా నియమించినట్లు పేర్కొన్నారు. మండలంలో ఇద్దరు వీఆర్వోలు ఇతర మండలాలకు బదిలీ కాగా మిగిలిన వీఆర్వోలకే ఇదే మండలంలో స్థాన చలనం కల్పించినట్లు వివరించారు.

ఫ్యాక్షన్ గ్రామాల్లో నిరంతర నిఘా



సీసీ కెమెరాల ఏర్పాటును పరిశీలిస్తున్న ఎస్‌ఐ

బనగానపల్లె రూరల్: ఫ్యాక్షన్ గ్రామాల్లో నిరంతర నిఘా ఉంచుతామని ఎస్‌ఐ బీటీ వెంకట సుబ్బయ్య తెలిపారు. శనివారం నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామక్రిష్ణాపురం గ్రామంలో నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో అల్లర్లు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లు, వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న వారి కదలికలపై నిఘా ఉంటుందని తెలిపారు. గొడవలకు దూరంగా ఉంటూ ప్రశాంత జీవితం గడపాలని సూచించారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని.. శాంతియుతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం రామచంద్రారెడ్డి

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ నియోజకవర్గస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం రామచంద్రారెడ్డి తెలిపారు. బనగానపల్లె మండలం నందవరం పాఠశాలలో జరిగిన నియోజకవర్గ స్థాయి అండర్ 14,17 విభాగాల్లో వివిధ క్రీడాంశాల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు. విద్యార్థులతో పాటు వ్యాయమ ఉపాధ్యాయుడు ప్రతాప్‌ను అభినందించారు.

బెల్లం ఊట ధ్వంసం

బనగానపల్లె: నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామతీర్థం గ్రామ శివారులో బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ బీటీ వెంకట సుబ్బయ్య శనివారం తెలిపారు. 400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నాటుసారా స్వాధీనం

బేతంచెర్ల: మండల పరిధిలోని బలపాలపల్లె గ్రామంలో నాటుసారా తయారు చేస్తున్న దుబ్బగాల మద్దిలేటిస్వామి, ఎల్లయ్య, గౌరిగాల్ల శేఖర్‌ను శనివారం అదుపులోకి తీసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ షేక్షావలి తెలిపారు. 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.






బేతంచెర్ల: వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కోవెలకుంట్ల: ఆంజనేయస్వామి ఆలయంలో.. అవుకు: చెన్నకేశవస్వామి ఆలయంలో కాటసాని తిరుపాల్‌రెడ్డి పూజలు, కొలిమిగుండ్లలో..

బాబుకు మంచి బుద్ధి ప్రసాదించు గోవిందా

- ఆలయాల్లో వైఎస్సార్‌సీపీ నాయకుల పూజలు
- డోన్‌లో మాజీ మంత్రి బుగ్గన, బనగానపల్లెలో కాటసాని పూజలు
- తిరుమల లడ్డూపై రాజకీయం చేయడంపై మండిపాటు
- పరిపాలన వైఫల్యాలను కప్పిపుచ్చేందుకేనని ఆరోపణ

కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయ లడ్డూలో వినియోగించే నెయ్యి కల్తీ జరిగిందని అసత్య ప్రచారంతో మహా అపచారం చేసిన సీఎం చంద్రబాబునాయుడు, కూటమి నాయకులకు సద్బుద్ధి ప్రసాదించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు వేడుకున్నారు. డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లోని ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా లడ్డూ వివాదాన్ని తెరపైకి తెచ్చి ప్రజల దృష్టిని మళ్లించేందుకు చూస్తున్నారని మండిపడ్డారు. ఎంతో పవిత్రంగా భావించే తిరుమల లడ్డూపై అరోపణలు చేస్తూ భక్తుల మనోభావాలను దెబ్బతీయడం దారుణమని పేర్కొన్నారు.

డోన్: డోన్‌లో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం డోన్, బేతంచెర్ల, ప్యాపిలి మండలాల్లోని పలు దేవాలయాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మధు ఫంక్షన్ హాల్ నుంచి పాతబస్టాండ్, పోలీస్‌స్టేషన్, కోర్టు మీదుగా వేంకటేశ్వర స్వామి ఆలయానికి పాదయాత్రగా వెళ్లి పూజలు చేశారు. చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించు స్వామి అంటూ వేడుకున్నారు. బుగ్గన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీ కూడా చంద్రబాబునాయుడు అమలు చేయలేదన్నారు. ప్రజాగ్రహానికి గురవుతాననే భయంతో గత ప్రభుత్వంపై విష ప్రచారానికి దిగుతున్నారని మండిపడ్డారు. తన రాజకీయ స్వార్థం కోసం తిరుమల లడ్డూను వాడుకోవడం.. సిగ్గు, లజ్జ లేకుండా దిగజారి మాజీ సీఎంపై విమర్శలు చేయడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. మొదటి నెలలో వరదలు, రెండో నెలలో కాదాంబరి సినీ నటి వ్యవహారం, ఆ తర్వాత తిరుపతి లడ్డులో కల్తీ అంటూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తారు. కుల, మతాలను రెచ్చగొట్టేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కులం, మతం అందరికీ తెలిసిందేనని, కొత్తగా తిరుమల వెళ్లి డిక్లరేషన్ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, శ్రీరాములు, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్‌లు బోరెడ్డి పుల్లారెడ్డి, మల్లెంపల్లె రామచంద్రుడు, నాయకులు పోస్టుప్రసాద్, నాగభూషణంరెడ్డి, రాజవర్ధన్, మల్యాల శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, జాకీర్‌హుసేన్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.




డోన్: మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, బనగానపల్లె ఆంజనేయస్వామి ఆలయంలో వినతి పత్రం సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అసత్య ఆరోపణలు మానుకోవాలి

బనగానపల్లె: తన వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు చంద్రబాబు గత ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో 108 కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజావ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకే దేవుని లడ్డూపై రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. స్వామివారిని దర్శించుకోవడానికి మాజీ సీఎం జగన్‌కు గతంలో లేని డిక్లరేషన్ ఇప్పుడు ఎందుకు అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సర్పంచ్‌లు వెంకట్రామిరెడ్డి, రమణ, మోహన్‌బాబు, నాయకులు మురళీమోహన్‌రెడ్డి, కాటసాని రామకృష్ణారెడ్డి, రామసుబ్బారెడ్డి, అబ్దుల్‌ఫైజ్, అబ్దుల్‌ఖైర్, శ్రీనివాసులు, సురేష్,వెంకట్రామిరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నీచ రాజకీయాలు తగవు

బేతంచెర్ల: తిరుమల లడ్డూ విషయంలో కూటమి ప్రభుత్వం నీచ రాజకీయం చేస్తోందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, బుగ్గన చంద్రారెడ్డి, గూని నాగరాజు, మురళీ కృష్ణ విమర్శించారు. గౌరిపేట వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు బాబుల్ రెడ్డి, ముర్తుజావలీ, ఖాజా హుసేన్, మద్దిలేటిస్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు శకుంతల, కోట్ల మధుసూదన్, సర్పంచ్‌లు వేణుగోపాల్ రెడ్డి, శ్రీరాములు, వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ రంగస్వామి, ఎంపీటీసీలు రామచంద్రుడు, నాగేషు పాల్గొన్నారు.

టీటీడీ పేరును భ్రష్టు పట్టిస్తున్నారు



మాట్లాడుతున్న ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి

అవుకు: రాజకీయ స్వలాభం కోసం టీటీడీని భ్రష్టు పట్టిస్తున్నారని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డితో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. లడ్డూ కల్తీ అంటూ భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. దేవుడితో రాజకీయం మంచిది కాదని హితవుపలికారు. అనంతరం అవుకులోని చెన్నకేశవస్వామి ఆలయం, ఉప్పలపాడు లక్ష్మీ కంబగిరి స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు గోపవరం గోపాల్ రెడ్డి, నాయకులు చల్లా సూర్య ప్రకాశ్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, జగదీష్, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించుస్వామి

కొలిమిగుండ్ల: తిరుమల పవిత్రతకు భంగం కలిగించేలా వ్యవహరించిన సీఎం చంద్రబాబు, కూటమి నాయకులకు మంచి బుద్ధి ప్రసాదించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వర రెడ్డి అన్నారు. స్థానిక లలితా సుందరేశ్వరస్వామి ఆలయం, మీర్జాపురంలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే లడ్డూ అంశాన్ని తెరపైకి తెచ్చారని ఆరోపించారు. వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, నాయకులు పేరం సత్యనారాయణరెడ్డి, సత్తిగారి రామిరెడ్డి, మనోహర్‌రెడ్డి, రవిప్రకాష్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధికోసం తిరుమల లడ్డూపై దుష్ప్రచారం



కోవెలకుంట్ల: వేంకటేశ్వరస్వామి ఆలయంలో కర్రా గిరిజ దంపతులు

కోవెలకుంట్ల: రాజకీయ లబ్ధి కోసం తిరుమల లడ్డూపై దుష్ప్రచారం చేసి అపచారం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మంచి బుద్ధి ప్రసాదించాలని ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ కర్రా గిరిజ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, గువ్వల రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయం, ఆంజనేయస్వామి దేవాలయం, శివాలయం, నరసింహస్వామి, భీమునిపాడు చౌడేశ్వరి అమ్మవారి దేవాలయాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు పూజలు చేశారు. ప్రజా వ్యతిరేకతను ప క్కదారి మళ్లించేందుకు దేవుడి లడ్డూతో రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయా కార్యక్రమాల్లో కర్రా తేజవర్ధన్ రెడ్డి, చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, గడ్డం వరప్రసాదరెడ్డి, నాగేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతం



అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతం చేస్తున్న అధికారులు

బనగానపల్లె రూరల్: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో గర్భిణులకు సామూహిక సీమంతం, పిల్లలకు అన్నప్రాసన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తహసీల్దార్ నారాయణరెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు గర్భిణులకు పసుపు కుంకుమ, చీర, రవిక, పూలు, పండ్లు అందజేసి సంప్రదాయబద్ధంగా సీమంతం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనత కోసం పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రతి రోజు ఆకుకూరలు, పండ్లు ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ, మండల ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి, డాక్టర్ మౌనిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శైలజ, సాలమ్మ, చిట్టెమ్మ, జమీలా తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో కోవెలకుంట్ల భేష్



వైద్యసేవలపై ఆరా తీస్తున్న డీసీహెచ్‌ఎస్ జఫురుల్లా

కోవెలకుంట్ల: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడంలో కోవెలకుంట్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నంద్యాల జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిందని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జఫురుల్లా అన్నారు. శనివారం స్థానిక సీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ప్రసూతి, అత్యవసర విభాగాల్లో వైద్య సేవలు పొందుతున్న రోగులను సేవలపై ఆరా తీశారు. ఆరు నెలల క్రితం కొత్తగా ప్రారంభించిన 30 పడకల ఆస్పత్రి భవనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓపీ, ఇన్‌పేషెంట్స్, ఎన్టీఆర్ ఆరోగ్యసేవా(ఆరోగ్యశ్రీ) జిల్లాలోని అన్ని సీహెచ్‌సీలకంటే కోవెలకుంట్ల ముందంజలో ఉందన్నారు. సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డిని అభినందించారు. డాక్టర్లు వెంకటలక్ష్మి, మోహజబీన్, నవీన్‌నారాయణరెడ్డి, నవీన్‌కుమార్, జగదీశ్వరి, స్టాఫ్‌నర్స్ ఇందిర ఉన్నారు.

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న తహసీల్దార్ నారాయణరెడ్డి

బనగానపల్లె రూరల్: స్థానిక పొదుపు భవనంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఎంపీపీ మానస వీణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధికారులు ఆయా శాఖల్లో మూడు నెలలుగా జరిగిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను సభ దృష్టికి తీసుకొచ్చారు. తహసీల్దార్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని భూ సమస్యలపై త్వరలో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాగే మండలంలో కొత్తగా రేషన్‌దుకాణాలు పెరుగుతాయని, కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. పలువురు ప్రజాప్రతినిధులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మండల ఉపాధ్యక్షురాలు ఎం.లక్ష్మీదేవి, ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు, హౌసింగ్‌శాఖ డీఈఈ కృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మధుసూదన్‌రావు, ఏఓ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

- కాపర్ తీగల అపహరణ



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఏఈ

ప్యాపిలి: మండలంలో కాపర్ కేటుగాళ్ల ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంస పరంపర కొనసాగుతూనే ఉంది. శుక్రవారం రాత్రి ప్యాపిలిలోని అరుణాచల ట్రాన్స్‌పోర్టు వద్ద 16 కేవీఏ సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేశారు. అందులో ఉన్న కాపర్ తీగలను అపహరించుకుని వెళ్లారు. విషయం తెలుసుకున్న ఏఈ వినయ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్యాపిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆగస్టు 24వ తేదీ, ఈ నెల 11వ తేదీ రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసిన దుండగులు తాజాగా శుక్రవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేశారు. దుండగుల చర్యలతో రైతులతో పాటు విద్యుత్ శాఖ అధికారుల్లో ఆందోళన నెలకొంది.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్‌ఐ

కోవెలకుంట్ల: అమడాల గ్రామంలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి శనివారం తెలిపారు. ఆయన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చెన్నుడు అనే రైతు రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి కుటుంబ సమేతంగా పొలం పనులకు వెళ్లాడు. గమనించిన ఇదే గ్రామానికి చెందిన రామమద్దిలేటి తాళం పగులగొట్టి ఇంట్లో ప్రవేశించి బీరువాలో దాచి ఉంచిన మూడున్నర తులాల బంగారు ఆభరణాలను అపహరించాడు. సాయంత్రం పొలం నుంచి ఇంటికి వచ్చిన రైతు ఇంట్లో వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉండడంతో చోరీ జరిగిందని భావించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దొంగను అదుపులోకి తీసుకుని బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వీధి కుక్కలతో జాగ్రత్త

ప్యాపిలి: వీధి కుక్కలతో పాటు ఇంట్లో పెంచుకునే కుక్కలు, పిల్లులతో అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ పారా మెడికల్ అధికారి రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక సరస్వతి శిశు మందిరంలో శనివారం ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని నిర్వహించారు. కుక్కకాటుపై అవగాహన కల్పించారు. కుక్క కాటుకు గురైతే గాయాన్ని నబ్బుతో కడిగి ప్రభుత్వాస్పత్రిలో యాంటీ రెబిస్ టీకాలు వేయించుకోవాలన్నారు. నెల రోజుల్లో 5 డోసులు టీకా వేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్ర గౌడ్, హెచ్‌ఎం రామాంజనేయులు, ఉపాధ్యాయుడు వాసు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి



మంత్రి బీసీకి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

బనగానపల్లె రూరల్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డికి ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో శనివారం వినతి పత్రం అందజేశారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ మద్దయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టు పిల్లలకు ప్రైవేట్ విద్యా సంస్థల్లో 60 శాతం రాయితీ కల్పించాలని, అర్హులైన వారికి అక్రిడేషన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సర్వేశ్వర రెడ్డి, ఉపాధ్యక్షులు రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, కార్యదర్శి షాషావలి, రఘురామిరెడ్డి, సుధాకర్, రమణ, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

కుక్క కాటుపై అవగాహన ముఖ్యం



కుక్కలకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

డోన్: కుక్క కాటును అశ్రద్ధ చేయకుండా సకాలంలో వైద్యశాలకు వెళ్లి టీకాలు వేయించుకోవాలని పశువర్థకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ నాగరాజు అన్నారు. శనివారం ప్రపంచ రేబిస్ నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక పశువైద్యశాలలో టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కుక్క కాటును నిర్లక్ష్యం చేస్తే రేబిస్ వ్యాధి సోకి ప్రాణాపాయం కలిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. కుక్క కాటుకు గురైన వారు సబ్బు నీటితో గాయాన్ని శుభ్రంగా కడిగి 3, 2, 7, 14, 28 రోజులలో ఐదు టీకాలను వేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 80 కుక్కలకు రేబిస్ వ్యాధి సోకకుండా టీకాలు వేయించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సంజామల: మండల పరిధిలోని మంగపల్లె గ్రామంలో పెద్దిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివా రం ఉదయం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నటు డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి తెలిపారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దసరా ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదు

బేతంచెర్ల: దసరా నవరాత్రి ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలని సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. గణేష్ ఉత్సవాలు విజయవంతం కావడంతో శనివారం కమిటీ సభ్యులు సీఐని సత్కరించారు. సీఐ మాట్లాడుతూ..డీజేల సంస్కృతికి స్వస్తి పలకాలని సూచించారు. నవరాత్రి ఉత్సవాల్లో డీజేలు పెడితే వాహనాలు సీజ్ చేస్తామన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా ఉత్సవాలు జరుపుకోవాలని హితవుపలికారు.

కంప్యూటర్‌లో ఉచిత శిక్షణ

డోన్ టౌన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో ఉచిత కంప్యూటర్ శిక్షణ, భోజన వసతి కల్పించనున్నట్లు సంస్థ కోఆర్డినేటర్ హరిప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 35 రోజుల శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. పదో తరగతి ఆపై చదివిన 18 నుంచి 28 ఏళ్ల యువతీయువకులు అర్హులన్నారు. 9000487423 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

సమాజాభివృద్ధిలో సైన్స్ కీలకం

బేతంచెర్ల: రాతియుగం నుంచి రాకెట్ యుగం వరకు సమాజ అభివృద్ధి గమనానికి సైన్స్ కీలకం అని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియదాసు అన్నారు. శనివారం మండల పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్లో 8,9, 10 తరగతి విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక సహకారంతో చెకుముకి సైన్స్ పరీక్షలు నిర్వహించారు.

భగత్‌సింగ్ జయంతి వేడుకలు

డోన్ టౌన్/కోవెలకుంట్ల/బేతంచెర్ల: భగత్ సింగ్ జయంతి సందర్భంగా శనివారం కోవెలకుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ నాయకులు భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. డోన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ నేతలు ఆశోక్, నక్కి హరి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం పద్మావతి, వెంకటసుబ్బారెడ్డి పుష్పాంజలి ఘటించారు. బేతంచెర్ల పాణ్యం సిమెంట్ జూనియర్ కళాశాలలో డీవైఎఫ్ఐ నాయకులు నివాళులర్పించారు.